అర్హులకు సంక్షేమ పథకాలందేలా చర్యలు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్


సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 51వ డివిజన్లో గల దండువారివీధి, రైల్వే ఫీడర్స్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. కపాడిపాళెంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని అధికారులకు సూచించామన్నారు. మరమ్మతులకు గురైన భూగర్భ డ్రైనేజీ పనులను సైతం పూర్తి చేస్తామని వెల్లడించారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా నగర నియోజకవర్గంలోని ప్రతి గడపకూ కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వెళ్తున్నారని, ఇందులో భాగంగా ఇప్పటికే 40 వేల గృహాలను సందర్శించారని చెప్పారు. ప్రజల వద్దకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తోందని, అయితే ప్రతిపక్షాలు కేవలం ప్రెస్‌మీట్లకే పరిమితమయ్యారని విమర్శించారు. కార్పొరేటర్ సాహిత్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక సంతోషకరం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరడం సంతోషంగా ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వడ్డెర సంఘ జాతీయ మహిళాధ్యక్షురాలు, టీడీపీ నేత నిర్మల, వారి మిత్ర బృందం దాదాపు 300 మంది ఎమ్మెల్యే అనిల్ సమక్షంలో పార్టీలో చేరారు. ఇస్కాన్ సిటీలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని సాదరంగా ఆహ్వానించిన అనంతరం అనిల్ మాట్లాడారు. టీడీపీకి చెందిన నిర్మల, వారి మిత్రబృందం, కుటుంబసభ్యులు తమ పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అనేక రంగాల్లో పదవులిస్తూ సీఎం ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం నిర్మల మాట్లాడారు. ఎమ్మెల్యే అనిల్ అడుగుజాడల్లో నిజాయతీగా పనిచేస్తూ పార్టీ పక్షాన ఉంటానని చెప్పారు. లాలూయాదవ్, మోహన్, లిఖిత్, గణేష్, ఫుజైల్, షఫీ, రాహుల్, సాయి, సనత్, శైలజ, పద్మ, వెంకమ్మ, నాగేశ్వరమ్మ, తదితరులు పార్టీలో చేరారు. జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, పార్టీ నేతలు సునీల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిల్

నేత్రపర్వంగా విషుక్కణి దర్శనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో విషుక్కణి దర్శనాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. కేరళ ఉగాదిని పురస్కరించుకొని ఆలయాన్ని ఫల, పుష్పాలు, కూరగాయలు, ధాన్యంతో తీర్చిదిద్దారు. గణపతి హోమం, శబరిమలవాసుడికి నవకాభిషేకం, విశేష పుష్పాభిషేకం, పుష్పార్చన, మహాహారతి, తదితరాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు నాణేలను అందజేశారు. స్వామి అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, నిర్వాహకులు సూర్యనారాయణరెడ్డి, మోహన్‌రావు, నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సునీల్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, కృష్ణచైతన్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో పనులు వేగవంతం


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న గృహాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని పేర్కొన్నారు. లేఅవుట్ల నిర్మాణం, అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. మౌలిక వసతులను త్వరితగతిన కల్పించి లబ్ధిదారులకు గృహాలను కేటాయించాలని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వెంకటదాస్, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, మెప్మా పీడీ రవీంద్ర, హౌసింగ్ విభాగాధికారి సిద్ధిఖ్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం కల్పించిన ఐదు శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో రెవెన్యూ విభాగాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 – 24 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులను ఈ నెలాఖరులోపు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ వర్తించనుందని పేర్కొన్నారు. ఈ అంశంపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆర్వోలు శ్రీనివాసులు, సమద్, రాజేశ్వరి, ఆర్‌ఐలు కృపాకర్, కృష్ణంరాజు, చినబాబు, కృష్ణకిషోర్, శ్రీనివాసులు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

• కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వికాస్ మర్మత్‌ను కార్పొరేటర్లు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలను తెలియజేశారు. పలు అంశాలను కమిషనర్‌కు తెలియజేశారు.

కనులపండువగా వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా శనివారం నిర్వహించారు. మందిర ప్రధానార్చకుడు దాశరథి నారాయణచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా రేవతికుమార్, ఉషారాణి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, కోశాధికారి మస్తాన్‌రావు, తదితరులు పర్యవేక్షించారు.

దర్గా అభివృద్ధికి ఎంపీ చొరవతో నిధుల మంజూరు


మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నేతలు

నెల్లూరు రూరల్: నగరంలోని బారాషహీద్ దర్గా అభివృద్ధికి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూ.15 కోట్లను మంజూరు చేయించడాన్ని పలువురు ముస్లిం మైనార్టీ నేతలు కొనియాడారు. నగరంలోని ఎంపీ ఆదాల నివాసంలో శనివారం వీరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీమ్, బారాషహీద్ దర్గా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్ ఖాద్రీ, రూరల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కంతర్ అలీ మాట్లాడారు. ముస్లిం మైనార్టీలపై ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడారు. కార్పొరేటర్లు సత్తార్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన



నెల్లూరు(క్రైమ్): అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని రెయిన్ స్క్వేర్‌లో అగ్నిమాపక సిబ్బంది శనివారం నిర్వహించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే మంటలను ఎలా ఆర్పాలి.. జనాలను ఎలా రక్షించాలి.. లిఫ్ట్‌లు పనిచేయకపోతే, మెట్ల మార్గం మీదుగా వెళ్లడం కష్టతరమైతే పైఅంతస్తులోని వారిని కిందికి ఎలా చేర్చాలనే అంశాలను డెమో ద్వారా వివరించారు.

• జిల్లా అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది పనితీరు, పరికరాల వినియోగంపై రంగనాయకులపేటలోని ఓ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై ముద్రించిన కరపత్రాలను రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లలో పంపిణీ చేశారు. అనంతరం పోస్టర్లను బస్సులకు అంటించారు. జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



నెల్లూరు(బారకాసు): నగరంలోని 12వ డివిజన్లో గల మంగళదిబ్బలో నివసిస్తున్న మూడు గిరిజన కుటుంబాల ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. విషయం తెలుసుకున్న మేయర్ స్రవంతి ఘటన ప్రాంతానికి వెళ్లి బాధితులను శనివారం పరామర్శించారు. నిత్యావసర సరుకులతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.ఐదు వేల చొప్పున అందజేశారు. బాధితులకు ప్రభుత్వ సాయాన్ని త్వరగా అందజేసేలా చర్యలు చేపట్టాలని అర్బన్ తహసీల్దార్‌కు ఫోన్లో సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): కలెక్టర్ హరినారాయణన్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఎంపీ పదవి నుంచి తొలగించడం దారుణం

నెల్లూరు (అర్బన్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఎంపీ పదవి నుంచి తొలగించడం, కేసు నమోదు చేయడం దారుణమని గైనకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు యశోధర పేర్కొన్నారు. రాహుల్ గాంధీపై కక్ష సాధింపులకు పాల్పడటాన్ని నిరసిస్తూ పలువురు డాక్టర్లు, న్యాయవాదులు, పార్టీల ప్రతినిధుల మద్దతుతో సత్యాగ్రహ దీక్షను గాంధీబొమ్మ వద్ద శనివారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి, డాక్టర్ పవన్‌కుమార్, ప్రతాప్, వెంకటేశ్వర్లురెడ్డి, టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత రఘురామ్ పాల్గొన్నారు.

25 నుంచి వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఎస్బీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరాలను ఈ నెల 25 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ సాయిబాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ప్రవేశ రుసుముతో నిర్వహించనున్న శిక్షణలో పాల్గొనాలనుకునే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. గాత్రానికి సంబంధించి 94944 95918, వయోలిన్‌కు 99660 26608, భరతనాట్యానికి గానూ 98664 58206, డోలుకు సంబంధించి 96184 81147 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

21 నుంచి క్యారమ్స్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్యారమ్స్ ర్యాంకింగ్ టోర్నీని ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్నామని క్యారమ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొదలకూరురోడ్డులోని నెల్లూరు క్లబ్‌లో పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 94933 64955, 98854 65998 నంబర్లను ఈ నెల 19లోపు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద విద్యుత్ స్తంభాలు, లైన్లను మార్చనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా ఆదివారం ఉండదని బాలాజీనగర్ ఏఈ ప్రసాద్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ్మూర్తినగర్, రామలింగాపురం ఉత్తర వైపు గల ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ శిక్షణ తరగతులు

నెల్లూరు (టౌన్): రామలింగాపురంలోని ఏబీవీపీ కార్యాలయంలో పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీకి సంబంధించిన ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించనున్నామని సంస్థ నగర కార్యదర్శి యశ్వంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని, స్టడీ మెటీరియల్స్‌ను ఉచితంగా అందజేయనున్నామని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని 18వ డివిజన్లోని రాజీవ్ గాంధీ కాలనీలో శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను ఆరాతీశారు. వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఎనలేని అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో కలిసి ఆయా గృహాలకు స్టిక్కర్లను అంటించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ వెంకయ్య, కార్పొరేటర్లు అశోక్‌నాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మద్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలి కుటుంబానికి సాయం

సాక్షి ఎఫెక్ట్..



నెల్లూరు(బారకాసు): అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన బాధితురాలు సుభాషిణి కుటుంబానికి రూ.ఐదు వేలను పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. 'మృత్యువుతో పోరాటం' అనే శీర్షికన సాక్షిలో ఈ నెల 11న ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. బాలాజీనగర్‌లోని మసీదు సెంటర్ సమీపంలో ఉంటున్న బాధితురాలి ఇంటికి వెళ్లి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆమె తల్లి మరియమ్మకు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు రమేష్‌రాజ్, అధ్యక్షుడు మునివెంకటసూర్య, సభ్యులు సాయిరెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీకి సత్కారం



నెల్లూరు రూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బారాషహీద్ దర్గా మాజీ చైర్మన్ అబూబకర్ శనివారం సత్కరించారు. దర్గా అభివృద్ధికి రూ.15 కోట్లను మంజూరు చేయించిన మంత్రి, ఎంపీకి కృతజ్ఞతలను తెలియజేశారు.

కలెక్టర్‌తో జెడ్పీ చైర్‌పర్సన్ భేటీ



నెల్లూరు రూరల్: కలెక్టర్ హరినారాయణన్‌ను నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం కలిశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

బేకరీలో అగ్నిప్రమాదం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): షార్ట్ సర్క్యూట్‌తో వెంకటేశ్వరపురం సెంటర్‌లోని బేకరీలో అగ్నిప్రమాదం సంభవించింది. వివరాలు.. వెంకటేశ్వరపురం సెంటర్‌లో విజయ బేకరీని విజయ నిర్వహిస్తున్నారు. అండర్ గ్రౌండ్‌లో కిచెన్ ఉంది. ఈ తరుణంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా శనివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఘటనలో వైర్లు, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటల ధాటికి భవన స్లాబు పెచ్చులూ ఊడిపోయాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన కిచెన్ గదిలో ఉన్న రెండు సిలిండర్లను బయటకు తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా రాధాకృష్ణ



నెల్లూరు(బారకాసు): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నగరానికి చెందిన రాధాకృష్ణను నియమిస్తూ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్ ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. ప్రకాశం జిల్లా ఇన్‌చార్జిగా సైతం నియమించామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వంశపారంపర్య ధర్మకర్తగా బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(బృందావనం): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వరస్వామి దేవస్థాన వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్తగా బాలాజీసింగ్ బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈయనతో ఈఓ పెంచలవరప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. నాగమణి, శ్రీకాంత్, సుభాన్‌సింగ్, ప్రభాకర్‌రెడ్డి, నవీన్, గోపాల్‌సింగ్, హరీష్, శారదమ్మ, దేవస్థాన ప్రధానార్చకుడు శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కమిషనర్ వికాస్ మర్మత్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

మోపెడ్ చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు నిలిపి ఉంచిన మోపెడ్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న సుధాకర్ కరెంటాఫీస్ సెంటర్‌లో ప్రొవిజన్స్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ నెల ఐదున తన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌ను ఇంటి ముందు నిలిపారు. ఈ క్రమంలో వాహనాన్ని గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఆటోను ఢీకొన్న బైక్



నెల్లూరు(క్రైమ్): ఆటోను ఢీకొని వాహనచోదకుడు గాయపడిన ఘటన వెంకటేశ్వరపురంలోని ఫ్లైఓవర్‌పై శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్‌పై వస్తున్న ఆటోను నెల్లూరు నుంచి బైక్‌పై వస్తున్న యువకుడు ప్రమాదవశాత్తూ ఢీకొన్నారు. ఘటనలో గాయపడిన వాహనచోదకుడ్ని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కాగా ఘటనపై ట్రాఫిక్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. గాయపడిన యువకుడు మైపాడు ప్రాంతానికి చెందిన వాడని స్థానికులు తెలిపారు.

క్లుప్తంగా

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



నెల్లూరు రూరల్: విద్యార్థులు మంచి క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లో గల ఎస్వీఎస్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కాలేషా సాహెబ్, కార్పొరేటర్ ప్రసాద్, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, స్కూల్ ఇన్‌చార్జి గౌరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'జెనెక్స్' వార్షికోత్సవ సంబరాలు



నెల్లూరు (టౌన్): జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ సంబరాలను నగరంలోని పీఏ స్వార్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం సీఎంఏ కోర్సులో ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. క్యాంపస్ ఎంపికల్లో ప్రతిభ చూపిన వారిని సత్కరించారు. కళాశాల డైరెక్టర్లు వెంగళ్‌రెడ్డి, కొండలరావు, తేజ, జ్యోతి, ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): కత్తితో బెదిరించి నగదును దోచుకెళ్లిన ఘటన ఏసీ సెంటర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని గోమతినగర్‌కు చెందిన విజయ్‌కుమార్ ఏసీ సెంటర్‌లోని పీకాక్ రెస్టారెంట్ అండ్ బార్‌లో మెయింటెనెన్స్ చేస్తున్నారు. ఇంట్లో భోజనం చేసి బార్ వద్దకు మధ్యాహ్నం వెళ్లారు. ఈ క్రమంలో కపాడిపాళెంకి చెందిన సాగర్ ఆయన్ను అడ్డుకొని మద్యానికి డబ్బివ్వాలని కోరారు. తన వద్ద లేదని విజయ్‌కుమార్ చెప్పగా, చంపుతానని కత్తితో బెదిరించి రూ.వెయ్యిని దోచుకున్నారు. ఇంకా డబ్బులు కావాలని బెదిరిస్తుండగా స్థానికులు రావడాన్ని గమనించి అక్కడి నుంచి సాగర్ పరారయ్యారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పులికల్లులో కేంద్ర బృంద పర్యటన



పొదలకూరు : మండలంలోని పులికల్లు పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం శనివారం పర్యటించింది. కేంద్రం బృందం సభ్యుడు మహేష్ మరుగుదొడ్ల నిర్మాణం, పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, పారిశుధ్యం, నేమ్‌బోర్డు, తదితర అంశాలను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, ఎస్టీ కాలనీలోని గృహ నిర్మాణాలు, రోడ్లు, తాగునీరు, వీధి దీపాలను నూరుశాతం ఏర్పాటు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట సర్పంచ్ జీవీ సుబ్బమ్మ, కార్యదర్శి మాధవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అరుణ, గ్రామపెద్ద జీ నారాయణరెడ్డి, గ్రీన్‌అంబాసిడర్లు ఉన్నారు.

చికెన్ వ్యర్థాల పూడ్చివేత

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో పట్టుకున్న 44 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను మత్స్యశాఖ అధికారులు, పోలీసులు శనివారం పూడ్చివేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఏడీ ప్రసాద్ మాట్లాడుతూ రేబాల విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక వైపునున్న రొయ్యల గుంతల్లో మేతగా వేసేందుకు లారీ, వ్యాన్‌లో తీసుకొచ్చిన చికెన్ వ్యర్థాలను శుక్రవారం పట్టుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను దామరమడుగు వద్ద పెన్నానది ఒడ్డున జేసీబీ సాయంతో గుంత తీసి అందులో పూడ్చివేశామన్నారు. ఎఫ్‌డీఓ పొట్టయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మార్గంలో నడుచుకోవాలి

కోవూరు: సమాజంలోని ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గంలో నడుచుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. లేగుంటపాడులోని శ్రీకృష్ణా అఖండానంద ఆశ్రమంలో భగవాన్ శ్రీరమణ మహర్షుల ఆరాధన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భగవాన్ రమణ మహర్షి గొప్ప తపస్వి, మహావైరాగ్య సంపన్నులని, దేహాభిమానం లేని దేదీప్యమానులని పేర్కొన్నారు. ఆయన భౌతికంగా మనమధ్యన లేకపోయినా ఆయన బోధనలు భక్తులను ఉద్ధరిస్తున్నాయన్నారు. రమణ మహర్షి భక్త బృందం శ్రీకృష్ణానంద స్వామి, చీమకుర్తి వెంకటేశ్వరరావు, తరిమద్దెల నరసింహారెడ్డి, జయకృష్ణ, ఉరురాయ, తదితరులు పాల్గొన్నారు.